క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండలంలో హాలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మనారాయణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కూర్మనారయణ స్వామి, హనుమన్నస్వామి వారికి గంగ పూజ, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

హాలహర్వి: క్షేత్రగుడి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి జలాభిషేకం, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి తదితర విశేష పూజలు చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రారంభమైన ఒంటి పూట బడులు



మధ్యాహ్నానికే ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

చిప్పగిరి: ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటి పూట బడులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలలో ఉదయం 7.45 గంటలకు తరగతులు ప్రారంభించి, 12.30 ముగించారు. మధ్యాహ్నానికే పాఠశాలలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ ఇల్లకు బయలుదేరి వెళ్లారు.కాగా ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటి పూట బడులు కొనసాగుతాయని ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

క్వారీల పరిశీలన



క్వారీని పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

కృష్ణగిరి: ఎరుకలచెరువు గ్రామ సమీపంలో ఉన్న గ్రానైట్ క్వారీలను తహసీల్దార్ చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు. గ్రామ పరిధిలోని మూడు క్వారీల్లో నిబంధనల మేరకు తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అనే విషయాలను తనిఖీ చేశారు. అలాగే లీజులకు సంబంధించిన పత్రాలను పరిశీలించడంతో క్వారీల సమీపంలోని పొలాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

చలివేంద్రం ప్రారంభం

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద శనివారం టీబీపీ ఎల్లెల్సీ హొళగుంద డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మిక్కిలినేని వెంకట శివప్రసాద్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ తహసీల్దారు నిజాముద్దీన్, మాజీ సర్పంచ్ రాజ పంపన్నగౌడ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ద్వారకనాథ్, మిక్కిలినేని శ్రీనివాసులు, అలేఖ్య విజయ్, దుర్గాప్రసాద్, పంచగుండిగ వెంకటేష్, చిన్న మల్లయ్య, వీరనాగప్ప పాల్గొన్నారు.

21 నుంచి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

వెల్దుర్తి: ఈనెల 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులను బెంగళూరు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా నందికొట్కూరు మున్సిపాలిటీ కేంద్రంలోని సాయిబాబ కల్యాణ మంటపంలో నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజేషన్ కో-ఆర్డినేటర్ ఈ. లింగన్న గౌడ్ తెలిపారు. శనివారం ఆయన వెల్దుర్తిలో మాట్లాడుతూ.. శిక్షణలో రాష్ట్ర, కేంద్ర అవార్డులు పొందిన ఉత్తమ రైతుల అనుభవాలు, గ్రూప్ డిస్కషన్, గో ఆధారిత వ్యవసాయంలోని మెలకువలు, సేంద్రియ ఎరువుల తయారీ, సస్య రక్షణ చర్యలపై చర్చ, అవగాహన ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మక్కువ గల రైతులు పాల్గొనాలని కోరారు. వివరాలకు 9849840414 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఇంకెన్నాళ్లీ మోసం?

పత్తికొండ రూరల్ : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన టమాట ప్రాసెసింగ్ యూనిట్‌ను తాజాగా అదే జీవో.739తో భూమిపూజ అంటూ హడావుడి చేయడం మళ్లీ ప్రజలను మోసం చేయడం కాదా అని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ క్రాంతినాయుడు శనివారం ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద రూ.8కోట్లు, ఆపరేషన్స్ గ్రీన్స్ కింద రూ.3కోట్లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రం కేటాయించిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నుంచి టమాటా ప్రాసెసింగ్ యూనిట్‌కు ఎలాంటి నిధుల కేటాయింపు జరగకున్నా తామే చేస్తున్నామన్నట్లుగా ప్రజలను మోసం చేయడం దుర్మార్గమన్నారు. కొత్తపెట్టుబడులతో ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్‌ను ఎందుకు తీసుకురాలేకపోతున్నారో మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

తుగ్గలి : మండలంలోని పి.కొత్తూరు గ్రామ శివారులో కొలువైన సుగాలి నాగమ్మ గ్రామ దేవత ఆలయ నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. భక్తుల విరాళాలతో ఆలయాన్ని నిర్మించనున్నారు. ఈ మేరకు పురోహితుడితో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు భూమి పూజ చేశారు.

మిర్చి రైతుల ఆశలు ఆవిరి

- ఏబీసీలో నిలిచిన నీటి సరఫరా
- చివరి దశలో పంట
- ఎండుతున్న మిర్చి పైరు
- దిగుబడులపై సన్నగిల్లుతున్న ఆశలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

చిప్పగిరి: హంద్రీ నీవా ద్వారా ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు నీటి సరఫరాను నిలిపివేయడంతో లక్షల రూపాయలు పెట్టుబడి సాగు చేసిన మిర్చి పంట ఎండుతోంది. దీంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. మండలంలో ఏబీసీ (ఆలూరు బ్రాంచ్ కెనాల్) కాలువ పొడవు 45 కి.మీ. మేర ఉంది. కాలువ పరిధిలో 19 పంట కాల్వలతో మండల కేంద్రం చిప్పగిరితో పాటు మండలంలోని ఏరూరు, డేగులహాలు, గుమ్మనూరు, కాజీపురం, బంటనహాలు, బెల్డోణ,కొట్టాల గ్రామాల తోపాటు హాలహర్వి, ఆలూరు మండలాల్లోని పలు గ్రామాలకు కలిపి మొత్తం 14,265 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. ఈ ఏడాది ఏబీసీ కాలువ కింద మండలంలో ప్రధానంగా మిర్చి పంట 6,200 ఎకరాల్లో సాగు చేశారు. ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టి కడ్డీ, డబ్బీ, సీడ్ తదితర రకాల మిర్చి పంటలు సాగు చేశారు. ఒక పక్క ధర పతనం అవుతూ నిరాశ పరుస్తుంటే పంట చివరి దశలో ఉన్న సమయంలో సాగు నీరు కూడా నిలిచి పోవడంతో మూలిగే నక్కపై తాటి కాయ పడ్డ చందంగా మారింది రైతుల పరిస్థితి.



చిప్పగిరి వద్ద ఏబీసీలో నిలిచిన నీటి ప్రవాహం



ఏరూరు వద్ద నీరు లేక ఎండుతున్న మిర్చి పైరు

ఎండుతున్న పంట..

ప్రస్తుతం మిర్చి పైరు చివరి దశలో ఉంది. సాధారణంగా మరో వారం పాటు నీరు విడుదల కావాల్సి ఉంది. అయినప్పటికీ అధికారులు ముందుగానే నీటి విడుదలను ఆపేశారు. దీంతో పంటలకు సాగు నీరందక పైరు ఎండిపోతోంది. ఈ సమయంలో నీరు లేకపోవడంతో మిరప కాయ బరువు కోల్పోతోంది. అలాగే పైరు పూర్తిగా వాడుముఖం పట్టాయి. అధికారులు మరో వారం పాటు నీటినందించాలని అన్నదాతలు కోరుతున్నారు.



బంటనహాలు వద్ద ఎండుతున్న మిర్చి పంట

చివరి దశలో నీరు లేక పంట ఎండుతోంది



ఎకరాకు రెండు లక్షల వరకు పెట్టుబడి పెట్టి నాలుగు ఎకారాల్లో మిర్చి పంట సాగు చేశా. పంట చివరి దశలో ఉండగా వారం రోజులు ముందుగానే నీటిని నిలిపి వేశా రు. దీంతో పైరు పూర్తిగా ఎండిపోతోంది. కోతల వరకు సాగు నీరు ఉంటే కాయలు బాగా బరువు పెరిగే అవకాశం ఉంది. నీరు లేక దిగుబడి తగ్గే ప్రమాదం ఏర్పడింది. మార్చి చివరి వరకు సాగు నీరు ఇస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– హేమంత్ కుమార్, రైతు, తిమ్మాపురం

పంట పరిస్థితిని రైతులు మా దృష్టికి తేలేదు



ఏబీసీ కెనల్ కింద సాగు చేసిన పంటల పరిస్థితి గురించి రైతులు తమ దృష్టికి తీసుకురాలేదు. పంటలు చివరి దశలో ఉన్నట్లు వినతి పత్రాలు అందజేస్తే ప్రభుత్వానికి పంపుతాం. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే నీరు మళ్లీ వదిలే అవకాశం ఉంది. అయితే సాగు సీజన్ ముగిసినట్లు కొందరు రైతులు చెబుతున్నారు.

– మంజునాథ్, డీఈఈ

దర్గా ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి

- అధికారులను నిలదీసిన ఎల్లార్తి గ్రామస్తులు
- గందరగోళం మధ్య దర్గాల నిర్వహణ టెండర్‌దారుడికి అప్పగింత



వక్ఫ్‌బోర్డు అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలో శనివారం గందరగోళం నెలకొంది. ఇటీవల దర్గాలను 11 నెలలు 15 రోజుల పాటు రూ.90 లక్షలకు నిర్వహణ టెండర్‌ను దక్కించుకున్న బిడ్డర్ షాఫీర్‌ఖాన్‌కు దర్గాలను అప్పగించేందుకు వచ్చిన వక్ఫ్‌బోర్డు అధికారులను గ్రామస్తులు నిలదీశారు. టెండర్ పొందిన షాఫీర్‌ఖాన్‌తో పాటు గ్రామస్తులు సర్దార్, బందప్ప, సర్దార్‌బాషా, రంగస్వామి, జాకీర్, చిదానంద, ఎంపీటీసీ బసప్ప తదితరులు దర్గాల ఆస్తుల విషయంలో వక్ఫ్‌బోర్డు అధికారులు ఈఓ ఇమ్రాన్‌బాషా, ఆదోని డివిజన్ వక్ఫ్‌బోర్డు ఆడిటర్ అండ్ ఇన్‌స్పెక్టర్ సుహెల్‌తో వాగ్వాదానికి దిగారు.అన్నదాన క్షేత్రంలోని సామగ్రి, మరుగుదొడ్లను తమకు అప్పగించాలని లేదా వక్ఫ్‌బోర్డు స్వాధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటికే అక్కడకు చేరుకున్న ఆలూరు ఎస్ఐ దిలీప్‌కుమార్ కలగజేసుకుని శాంతభద్రతలకు విఘాతం కలగకుండా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అన్నదాన కేంద్రంలోని సామగ్రిని టెండర్‌దారుడికి అప్పగిస్తామని. మరుగుదొడ్ల విషయంలో నకిలీ పత్రాలతో స్థలం మాదని కొందరు అంటున్నారని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వక్ఫ్‌బోర్డు అధికారులు తెలిపారు. ఎట్టకేలకు రెండు దర్గాలు, 38 రూములు, చందాపట్టి, చర్మ సేకరణ, చెకెర, హేర్ కటింగ్ తదితర వాటి నిర్వహణను షాఫీర్‌ఖాన్‌కు అప్పగించారు. అయితే టెండర్‌లో రెండు దర్గాల్లోని హుండీలు, స్కిన్ సేకరణ వక్ఫ్ బోర్డు పరిధిలో ఉంటాయన్నారు.

పెట్రోల్ కల్తీపై విజిలెన్స్ అధికారుల విచారణ



పంపు నుంచి పెట్రోల్ సేకరిస్తున్న తూనికల విభాగం విజిలెన్స్ అధికారులు

ఆలూరు రూరల్: పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఓ పెట్రోల్ బంకులో పెట్రోల్ కల్తీపై తూనికలు,కొలతల విభాగం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి శనివారం తహసీల్దార్ గోవింద్ సింగ్ సమక్షంలో నాణ్యత పరీక్షలు నిర్వహించారు. రామదుర్గం గ్రామానికి చెందిన ఈరన్న శుక్రవారం బాటిల్‌లో పెట్రోల్ పోయించుకుని వెళ్లి బైక్‌లో వేసిన తర్వాత స్టార్ట్ కాకపోవడంతో పెట్రోల్ కల్తీ అయ్యిందని నిర్వాహకులను నిలదీసి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఇందులో భాగంగా శనివారం తూనికలు,కొలతల శాఖ విభాగం విజిలెన్స్ అధికారులు తహసీల్దార్ సమక్షంలో పెట్రోల్ నాణ్యత పరీక్షలు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. పరీక్షల్లో భాగంగా పెట్రోల్ కల్తీ జరగలేదని నిర్ధారించామన్నారు. నాణ్యత పరీక్షలో చూపించిన డెన్సిటీ వివరాల నివేదికను జిల్లా డీఎస్ఓకు పంపిస్తామని చెప్పారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సీఎస్‌డీటీ దీపా, ఆర్ఐ గుండాల్ నాయక్, వీఆర్వో మహేంద్ర ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

మద్దికెర : స్థానిక ఆదర్శ పాఠశాలలో ఈనెల 1వ తేదీ నుంచి జరుగుతున్న ఇంటర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సవిత, డీఓ కిరణ్మయి మాట్లాడుతూ ఫస్టియర్ పరీక్షకు 212 మంది విద్యార్థులకు గాను 11 మంది, సెకండియర్ పరీక్షకు 138 గాను ఏడుగురు విద్యార్థులు గైరాజరయ్యారని చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

వెల్దుర్తి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ సెంటర్‌గా ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు శనివారం నాటి సెకండియర్ పరీక్షతో ముగిశాయి. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షలను ఈ కేంద్రంలో అదే కాలేజీతోపాటు కేజీబీవీ, అంబేడ్కర్ గురుకులం, ప్రైవేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు రాశారు. ఆఖరు రోజు కెమిస్ట్రీ, కామర్స్ సెకండియర్ పరీక్షకు 174 మంది హాజరయ్యారని సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ మల్లికార్జున తెలిపారు. పరీక్షను డీఈఎస్ సభ్యులు నాగభూషణం రెడ్డి, సురేశ్ కుమార్ తనిఖీ చేశారు. పరీక్షలకు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా రామాంజనేయులు వ్యవహరించారు.



పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు

వివాదాస్పద స్థల పరిశీలన

హాలహర్వి: చింతకుంట గ్రామంలోని సర్వే నంబర్ 359లోని వివాదాస్పదమైన స్థలాన్ని తహసీల్దార్ నజ్మాభాను, ఆర్ఐ మమేష్, సర్వేయర్ మంజుభార్గవి శనివారం పరిశీలించారు. చంద్ర, శశి అనుభవంలో ఉన్నారని, కానీ అంజి అనే వ్యక్తి ఆ స్థలం తనదేనని వాదిస్తున్నాడని ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఇరువురి డాక్యుమెంట్లను పరిశీలించి, ఎవరికి చెందుతుందో పరిశీలించి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామని చెప్పారు.

ఘనంగా గరుడోత్సవం

మద్దికెర : బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెరవలి గ్రామంలో కొలువైన శ్రీరంగనాథుడు శ్రీదేవి, భూదేవి సమేతంగా శనివారం గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఉదయం ఆలయంలో స్వామివారికి బిందెసేవ, పంచామృతాభిషేకం, అష్టోత్తరనామార్చన తదితర పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఆశీనులు గావించి పుర వీధుల్లో ఊరేగించారు.



దేవేరులతో గరుడ వాహనంపై దర్శనమిస్తున్న శ్రీవారు

ఘనంగా ఇమాంసాహెబ్ వలి ఉరుసు

మద్దికెర : మండల కేంద్రం శివారులో రైల్వే గేట్ దగ్గర కొలువైన ఇమాంసాహెబ్ వలి ఉరుసు మహోత్సవాల్లో భాగంగా శనివారం షంషీర్ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన స్వామి వారి షంషీర్‌ను గుర్రంపై కొలువుంచి మేళ తాళాలు, డప్పు వాయిద్యాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్వామి వారికి కానుకలను సమర్పించారు.

షంషీర్‌ను గుర్రంపై ఊరేగిస్తున్న దృశ్యం



సామాజిక తనిఖీ ప్రజావేదిక వాయిదా

తుగ్గలి : ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి శనివారం తుగ్గలిలో నిర్వహించాల్సిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక వాయిదా పడింది. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం సందర్భంగా ప్రజా వేదిక సమావేశం సోమవారానికి వాయిదా వేసినట్లు ఏపీఓ హేమసుందర్ తెలిపారు. కూలీలు, అధికారులు, సిబ్బంది గమనించాలని కోరారు.

పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

ఆలూరు రూరల్: పాలిసెట్-2025 (పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)కు దరఖాస్తు చేసుకోవాలని ఆలూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నప్ప రెడ్డి శనివారం ఓ ప్రకటలో తెలిపారు. పాలిసెట్ రిజిస్ట్రేషన్లు ఈ నెల 12వ తేదీన ప్రారంభమయ్యాన్నారు. ఏప్రిల్ 15వ తేదీ రిజిస్ట్రేషన్లకు తుది గడువన్నారు. గడువులోగా అభ్యర్థులు పాలిసెట్ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు ఎస్సీ,ఎస్టీలకు రూ.100, బీసీ,ఓసీ విద్యార్థులకు రూ.400 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటి పూట ప్రకటించాలి

వెల్దుర్తి: అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటి పూట (హాఫ్‌డే స్కూల్) ప్రకటించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత డిమాండ్ చేశారు. శనివారం ఆమె వెల్దుర్తిలో మాట్లాడుతూ ఎండలు మండుతున్న నేపథ్యంలో ఇప్పటికే ప్రభుత్వం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు హాఫ్‌డే ప్రకటించి అంగన్‌వాడీలను విస్మరించడం శోచనీయమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఉంటారని, ఎండలను, కేంద్రాల్లో ఉక్కపోతను తట్టుకోవడం కష్టమన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

జయప్రదం చేయండి

ఆలూరు: ఏపీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఈనెల 19వ తేదీన విజయవాడలో నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ రాష్ట్ర నాయకుడు మహ్మద్ రఫి శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ రద్దును కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహ రించుకోవాలని, మినిమం టైమ్ స్కేల్ అమలు చేసి కారుణ్య నియమాకాలు తదితర వాటిని చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం

ఆలూరు రూరల్: ప్లాస్టిక్ భూతాన్ని తరిమేసి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఈఓపీఆర్డీ ప్రభాకర్ తెలిపారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలూరులో ప్రభుత్వ బాలుర పాఠశాల-2 విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బట్ట సంచులు, జూట్ బ్యాగులు వాడాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాంలీల, పీఈటీ కవిరాజు పాల్గొన్నారు.

- **తుగ్గలి :** పరిసరాల శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ విశ్వమోహన్ అన్నారు. శనివారం గ్రామంలో ర్యాలీ చేపట్టి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ శ్రీహరి, సర్పంచ్ రవి, ఎంపీటీసీ సభ్యుడు రాజు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.
- **చిప్పగిరి:** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ అల్లాబకాష్ అన్నారు.శనివారం స్థానిక ఎస్సీ కాలనీ నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ రజిని పాల్గొన్నారు.
- **ఆస్పరి:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓఆర్‌డీ విజయయ భాను సూచించారు. శనివారం ఆస్పరిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థునులతో ర్యాలీ నిర్వహించారు.
- **మద్దికెర :** ప్లాస్టిక్ వాడడం వల్ల పర్యావరణం కాలుష్యమవుతుందని అలాగే జీవకోటికి ముప్పుగా మారిందని, ప్రజలు ప్లాస్టిక్ వినియోగించడం మానుకోవాలని డీఎల్‌పీఓ వీరభద్రప్ప, సర్పంచ్ సుహాసిని అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై మహాత్మా గాంధీ సర్కిల్ నుంచి ప్రధాన బజారు వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఈఓ శివకుమార్, ఉప సర్పంచ్ ప్రమీలమ్మ, హెచ్ఎం దేవేంద్రప్ప పాల్గొన్నారు.



ఆలూరులో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పంచాయతీ అధికారులు

- **వెల్దుర్తి:** చెత్త నిర్వహణపై అవగాహన కలిగి, పంచాయతీ హరిత రాయబారులకు సహకరించి, తడి, పొడి చెత్తలను అప్పగిస్తూ, ప్లాస్టిక్ రహిత సమాజం వైపు నడవాలని జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ ముత్యాల శైలజ, ఎస్ఐ అశోక్, ఈఓ లక్ష్మీనాథ్ అన్నారు. శనివారం వారు పట్టణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.
- **దేవనకొండ:** ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సూచించారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ నుంచి బస్టాండు వరకు ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. బస్టాండు ప్రాంతంలో ప్రతిజ్ఞ చేశారు.
- **హొళగుంద:** ప్లాస్టిక్ వాడడం ప్రాణాంతకమని, రోడ్డుపై చెత్త వెయడం పర్యావరణానికి హానికరమంటూ గజ్జహళ్లి గ్రామంలో ప్రైమరీ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. శనివారం ర్యాలీ చేపట్టారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

వెల్దుర్తి: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులం ప్రిన్సిపాల్‌ను తక్షణం సస్పెండ్ చేయాలని కోరుతూ శనివారం బీజేపీ, సీపీఐ, విద్యార్థి సంఘాల నాయకులు గురుకులం ఎదుట ధర్నా చేశారు. గురుకులంలో అవినీతి, అసౌకర్యాలపై ఆరోపణల నేపథ్యంలో ప్రిన్సిపాల్ వైఖరి గర్హనీయమని, విద్యార్థి సంఘాలను, మీడియాను గురుకులంలోకి అనుమతివ్వకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు.బీజేపీ మండల అధ్యక్షురాలు శాంతి, సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు టి కృష్ణ, సుధీర్ నాయుడు పాల్గొన్నారు.

వేతనం అందేదెన్నడు?

- డెబ్బై రోజులైనా అందని ఉపాధి కూలి
- పనుల్లో పాల్గొనేందుకు కూలీల అనాసక్తి
- అదిగో..ఇదిగో అంటున్న అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వేతనజీవులు



హాలహర్వి వద్ద ఉపాధి పనుల్లో పాల్గొన్న కూలీలు

హాలహర్వి: గ్రామాల్లో వలసల నివారణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నీరుగారి పోతోంది. కూలీలకు సకాలంలో వేతనాలు అందడం లేదు. రోజువారీ మస్టర్లు వేస్తూ బిల్లులు జనరేట్ చేస్తున్నా కూలి మాత్రం పడటం లేదు. దీంతో కుటుంబాలు గడవడం ఇబ్బందిగా మారిందని కూలీలు ఆందోళన చెందుతున్నారు. హాలహర్వి మండలంతోపాటు మిగతా మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పనులు చేస్తున్నా, వేతనాలు చెల్లించడంలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. దీంతో నెలల తరబడి వేతనాలు చెల్లించకపోతే ఎలా అని కూలీలు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి పనుల కల్పనలో తాత్సారం చేస్తున్నారు. చాలా మండలాల్లో అంతంత మాత్రంగా పనులు జరుగుతుండగా, వీటిలో పాల్గొన్న వేతనదారులకు వేతనాలు అందని దుస్థితి. మరోపక్క జనవరి నుంచి పనులు చేసిన వారికి వేతనాలు నేటికీ అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు.

మండలంలో 7,526 జాబ్‌కార్డులు

మండలంలో మొత్తం జాబ్‌కార్డులు 7,526 ఉండగా, 16,025 కూలీలు ఉన్నారు. వీరందరూ ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. అయినా వేతనాలు అందకపోవడంతో ఒక్కొక్కరుగా ఉపాధి పనుల నుంచి వైదొలుగుతున్నారు. జనవరి నెల నుంచి పనులు చేస్తున్నప్పటికీ కూలి చెల్లింపులకు నిధులు విడుదల కాలేదు.

భారీగా బకాయిలు

ప్రతి కూలీకి గరిష్ఠంగా రూ.300 వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు సిబ్బందికి సూచిస్తున్నారు. అయితే మండలంలో సరాసరి రూ.180 నుంచి రూ.260 వరకు మాత్రమే వేతనం లభిస్తోంది. ఈ లెక్కన దాదాపు ఒక్కొక్కరికీ రూ.10 వేలకు పైగా బకాయిలు ఉన్నాయి. ఒక ఇంట్లో ఇద్దరేసి వ్యక్తులు పనికి వెళ్తే ఒక్కో కుటుంబానికి రూ.20 వేలకు పైబడి కూలి చెల్లించాల్సి ఉంది. వేతనాలపై సంబంధిత అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని కూలీలు వాపోతున్నారు. రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకొని బకాయిలు వెంటనే ఖాతాలకు జమ చేయాలని వేతనదారులు కోరుతున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం..

వేతనాలు అందక కూలీలు ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వంలో చలనం రాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జనవరి నెల నుంచి కూలి అందడం లేదని అన్ని ప్రాంతాల నుంచి కూలీలు అధికారులకు వినతి పత్రాలు అందజేస్తున్నా చర్యలు తీసుకోలేదు. దీంతో చాలా మంది పనులకు వెళ్లడం మానుకుంటున్నారు.


వెంటనే చెల్లించాలి



రోజూ ఉపాధి పనులు చేస్తున్నాం. జనవరి నెల నుంచి మాకు కూలి ముట్టలేదు. వారం వారం బ్యాంకు, పోస్టాఫీసుకు వెళ్లి చెక్ చేస్తుంటే ఇంకా డబ్బులు జమ అవ్వలేదని చెబుతున్నారు. దీంతో రోజురోజుకి బకాయిలు పెరుగుతున్నాయి. ఇల్లు గడవడం కష్టమైంది. పని చేసిన దానికి డబ్బులిస్తే మాకు చేయడానికి ఇబ్బంది ఉండదు. కూలి ఇవ్వడం లేదని చాలా మంది పనులు మానుకుంటున్నారు.

– లక్ష్మి, ఉపాధి కూలీ, నిట్రవట్టి గ్రామం

నెలాఖరులోపు నిధులు వచ్చే అవకాశముంది



ఉపాధి వేతనాలకు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది. సుమారు ఆరు నుంచి ఏడు వారాలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు వచ్చిన వెంటనే జమ చేస్తాం. వారం, పది రోజుల్లో స్తాయని భావిస్తున్నాం. వేతనదారులు ఆందోళన చెందవద్దు, పీడీ దృష్టికి తీసుకెళ్లాం. పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లిస్తాం.

– చక్రవర్తి, ఏపీఓ, హాలహర్వి